

కౌంటింగ్‌కు తరలి వెళ్తున్న పోస్టల్ బ్యాలెట్లు



పుల్లలచెరువులో పోలీసుల కవాతు

నేడు ఓట్ల లెక్కింపు

- 21 రోజుల ఉత్కంఠకు తెర
- ఈవీఎంల నుంచి బయట పడనున్న నాయకుడు

యర్రగొండపాలెం: కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్న తరుణం ఆసన్నమైంది. 21 రోజుల ఉత్కంఠకు నేటితో తెర పడనుంది. గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ నాయకుడు గెలుపు కోసం ప్రజలు ఓటు వేశారు. వారిచ్చిన తీర్పు ఈవీఎంలో భద్రపరిచారు. ఆ తీర్పును మంగళవారం అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు మాత్రం తమ నాయకుడు గెలుపు ఖాయమన్న ధీమాతో ఉన్నారు. ఈ పాటికే లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. యర్రగొండపాలెం ఎస్సీ నియోజకవర్గం నుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీల మధ్యే పోటీ ఉంటుంది. కాంగ్రెస్ ఇతర పార్టీలు పోటీలో ఉన్నప్పటికీ అవి వైఎస్సార్ సీపీ, టీడీపీల దరిదాపులోకి చేరలేవు. నియోజకవర్గంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మొత్తం ఓటర్లు 2,07,214 కాగా 1,85,242 ఓట్లు పోలయ్యాయి. పుల్లలచెరువు మండలంలోని ముటుకుల పోలింగ్ బూత్‌ను పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై టీడీపీ వర్గీయులు రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. పరిస్థితి విషమించడంతో కానిస్టేబుల్ రెండు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అదే మండలంలోని సిద్ధనపాలెం, శతకోడు, యర్రగొండపాలెం మండలంలోని పెద్దబోయలపల్లె గ్రామాల్లో పోలింగ్ జరుగుతున్న సమయంలో టీడీపీ వర్గీయులు ఘర్షణకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలు మినహాయించి నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కాగా నేడు జరిగే ఓట్ల లెక్కింపు కోసం నియోజకవర్గంలోని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు తరలిన కౌంటింగ్ ఏజెంట్లు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఒంగోలు రైజ్ కళాశాలలో మంగళవారం జరుతున్న తరుణంలో ఆయా పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు సోమవారం తరలి వెళ్లారు. అక్కడ వీరు రాత్రికి బసచేసి ఉదయం 6 గంటల ప్రాంతంలో పోలింగ్ కౌంటింగ్ సెంటర్‌కు చేరాల్సి ఉంది. నియోజకవర్గంలో ఉన్న 265 పోలింగ్ బూత్‌లను ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల ప్రకారం ఓట్లు లెక్కింపు జరుగుతుంది. ఈ లెక్కల ప్రకారం మొత్తం 19 రౌండ్లు లెక్కింపు ఉంటుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారని రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటసత్యనారాయణ తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారని, పెద్ద ఎత్తున ప్రత్యే పోలీసులను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్‌లు తరలించే ఏర్పాట్లలో ఆర్వో లోకేశ్వరరావు

కౌంటింగ్ కేంద్రానికి తరలిన పోస్టల్ బ్యాలెట్‌లు

స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను సోమవారం ఒంగోలులోని రైజ్ కళాశాలకు తరలించారు. అక్కడ ఉన్న ఈవీఎంలతో వీటిని రాత్రికి భద్రపరచి ఉదయం తొలి విడతలోనే వీటిని లెక్కిస్తారు. ఉద్యోగులు, హోం ఓటింగ్, అత్యవసర సేవలు, సర్వీస్ ఓటర్లను కలుపుకొని మొత్తం 2,246 పోస్టల్ ఓట్లు ఉన్నాయి. వాటిలో 1,816 ఓట్లు పోలయ్యాయి. ఇవిగాక 221 సర్వీస్ ఓట్లలో ఎన్ని పోస్టులో వచ్చాయన్న విషయం కౌంటింగ్ సమయంలో తెలుస్తాయి.

పుల్లలచెరువులో పోలీసుల కవాతు

పుల్లలచెరువు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా జిల్లా అధికారుల ఆదేశాలపై మండల కేంద్రం పుల్లలచెరువులో సోమవారం ఎస్‌ఐ ఫిరోజ్ ఫాతిమా ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులు పురవీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పురప్రజలకు పలు సూచనలు చేశారు. నేడు కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా ఎటువంటి అలజడులు సృష్టించరాదన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. ఆవేశపూరిత పనులు చేసి జైలుకు వెళ్లొద్దని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ మంగళవారం బయటకు రాకుండా ఇంటి వద్దే ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురు కలిసి ఉండరాదన్నారు. ఎన్నికల నియమాలు పాటించాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పోలీసుల పికెట్ 6వ తేదీ వరకు ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తాళ్లూరు (ముండ్లమూరు): ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వైవీ రమణయ్య సోమవారం హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో షాపుల మూతవేయాలని హెచ్చరికలు జారీ చేసినందున యజమానులు సహకరించాలన్నారు. ఎవరు గెలిచినా అదే రోజు సంబరాలు చేసుకోకుండా సంయమనం పాటించాలన్నారు. ప్రశాంతతకు భంగం కలిగించే పనులు చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు.



వైవీ రమణయ్య

ప్రజలు నిబంధనలు పాటించాలి

ముండ్లమూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని ఎస్‌ఐ వి.ఆంజనేయులు కోరారు. మండలంలోని మారెళ్ల, శంకరాపురం, ముండ్లమూరు, పెద ఉల్లగల్లు, ఈదర, ఉమామహేశ్వరపురం, నాయుడుపాలెం, పోలవరం, శింగనపాలెం, వేముల గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు దుకాణాలను సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు మూతవేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రజలు గృహాలకే పరిమితం కావాలన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఒకే చోట నలుగురు గుమిగూడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ నాయకులు సంయమనం పాటించి మండలంలో శాంతియుతంగా ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ ముగిసేందుకు సహకరించాలన్నారు. ఫలితాల అనంతరం బాణసంచా పేల్చడం చేయరాదన్నారు. ఎవరైనా మద్యం తాగి ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఎవరికైనా ఇతరుల నుంచి ముప్పు ఉంటే అత్యవసర సమయంలో 112, 100 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఆయా గ్రామాలలో దుకాణాలను మూతవేయించారు.



ఎస్‌ఐ ఆంజనేయులు



వాహనాల్లోకి ఎక్కిస్తున్న పోస్టల్ బ్యాలెట్‌లు

ఎన్నికల అధికారులకు సహకరించాలి

- ఆర్వో లోకేశ్వరరావు

దర్శి: నేడు జరగనున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, నాయకులు ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా పూర్తి స్థాయిలో ఎన్నికల అధికారులకు, పోలీసులకు సహకరించాలని ఆర్వో లోకేశ్వరరావు కోరారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో సోమవారం పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో లెక్కింపు కోసం ఒంగోలులోని రైజ్ కళాశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ జిల్లా మొత్తం 144సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడి ఉండకూడదని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడరాదన్నారు. అటువంటి వ్యక్తులపై పలు యాక్ట్‌ల ద్వారా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి యుత వాతావరణంలో ఉండి గెలుపోటములు సమానంగా స్వీకరించాలని కోరారు. దర్శి నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవీఎంలు మూడు కౌంటింగ్ హాల్స్‌లో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ కౌంటింగ్ హాలులో మొదటగా ఈటీపీబీఎస్ సర్వీస్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, రెండో కౌంటింగ్ హాల్లో వేరు వేరుగా అసెంబ్లీ, పార్లమెంట్ లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. అన్నీ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు ఎన్నికల కమిషన్ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన హ్యాండ్ బుక్‌లు ఇచ్చినట్లు చెప్పారు. వాటితో డిక్లరేషన్‌లో సంతకాలు కూడా తీసుకున్నామన్నారు. 4వ తేదీ ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, వారి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు వారికి జారీ చేసిన గుర్తింపు కార్డులతో సహా స్ట్రాంగ్ రూం కౌంటింగ్ హాలు వద్దకు రావాలని సూచించారు. కౌంటింగ్ హాలు, కౌంటింగ్ తర్వాత కానీ ఎటువంటి అల్లర్లకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు మరి ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఉంటుందని చెప్పారు. అన్నీ ప్రధాన మార్గాలు, కౌంటింగ్ హాలులో సీసీ కెమెరాల భద్రత ఉందని తెలిపారు. కెమెరా పర్యవేక్షణ, వీడియో గ్రఫీతో మొత్తం కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్ర పరిసరాలు రెడ్ జోన్‌గా పరిగణిస్తున్న సందర్భంగా అందరూ సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో తాగు నీరు, అగ్నిమాపక చర్యలు, భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గానికి సంబంధించి పార్లమెంట్ 14 టేబుళ్లు, అసెంబ్లీ 14 టేబుళ్లలో మొత్తం 21 రౌండ్లో ఈవీఎం కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో 3వ తేదీ వరకు 220స ర్వీసు ఓట్లకుగాను 92 సర్వీసు ఓట్లు పోస్టుద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చినట్లు ఆర్వో లోకేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, సీఐ సమీఉల్లా, డీటీ రవిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

కురిచేడు: ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, నాయకులు సహకరించాలని ఎస్సై శ్రీ కాంత్ కోరారు. ర్యాలీలు, బాణసంచా పేల్చటం, ఊరేగింపులును ఎన్నికల కమిషన్ నిషేధించిందని ఆయన గుర్తు చేశారు. వాటికి భిన్నంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలుతోపాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

లెప్రసీ రోగులను గుర్తించాలి

- డీపీఎంఓ వరప్రసాద్

మద్దిపాడు: లెప్రసీ రోగులను గుర్తించాలని జిల్లా పారామెడికల్ ఆఫీసర్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని కొలచనకోట గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యశాఖ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి పలు సలహాలు, సూచనలు చేశారు. స్పర్శలేని రాగి రంగు మచ్చలు ఉంటే వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని, తగిన పరీక్షలు చేయించాలని అన్నారు. లెప్రసీ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే వ్యాధి నయమయ్యే వరకూ వారికి తగిన మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. కుష్టువ్యాధి నయమయ్యే వ్యాధి అని తెలిపారు. అందువలన ఈ వ్యాధిపై ప్రజలలో కూడా అవగాహన కల్పించాలని ఆశావర్కర్లకు సూచించారు. కుష్టువ్యాధి నివారణ లక్ష్యంగా అందరం పనిచేద్దామని అన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బాలకోటయ్య, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంఓ వరప్రసాద్, నోడల్ ఆఫీసర్ బాలకోటయ్య

క్లుప్తంగా

గనివానిపాడులో జోరు వర్షం

కొనకనమిట్ల: నైరుతి రుతు పవనాల రాక, ఆవర్తన ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున మండలంలోని గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో జోరుగా వర్షం కురిసింది. కుంటలకు నీరు చేరడంతోపాటు గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రహదారిలో చప్టా వద్ద వరద నీటి ప్రవాహానికి రెండు చోట్ల రోడ్డు దెబ్బతింది. రోడ్లు దెబ్బతిన్న విషయం అధికారులకు తెలియజేసినట్లు గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షానికి భూములు పదునెక్కడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభ చాటాలి

మార్కాపురం టౌన్: విద్యతోపాటు సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని తర్లుపాడు ఎంపీడీఓ బి.చంద్రశేఖర్ కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం సంస్థ అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక, శారీరక పరిపక్వతకు పునాదిలాంటివన్నారు. ఈటీపీఆర్‌డీ బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడా, నటన, నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ తీసుకోవడం అభినందనీయమన్నారు. సమాజాభివృద్ధికి కాంక్షించే ప్రతి ఒక్కరూ సేవా సంఘం నిర్వాహకులకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

బూచేపల్లిని కలిసిన మంత్రి మేరుగు నాగార్జున



బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున సోమవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల పోలింగ్ జరిగిన తీరు, ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ కృష్టిపాటి శేఖరరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

50 శాతం మందికి ప్రభుత్వ మెడికల్ సీట్లు

ఒంగోలు: నీట్ 2024 తుది కీలో తమ విద్యార్థులు 50 శాతం మంది ప్రభుత్వ మెడికల్ సీట్లు సాధించబోతున్నట్లు ఒంగోలు స్మార్ట్ నీట్ అకాడమీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం అకాడమీ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 2022లో తొలి బ్యాచ్‌లో 14 మంది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షకు హాజరైతే ఏడుగురు సీట్లు సాధించారన్నారు. 2023 రెండో బ్యాచ్‌లో 30 మందిలో 10 మంది సీట్లు సాధించారని చెప్పారు. కానీ, నేడు విడుదలైన 2024 నీట్ తుది కీలో పరీక్షలు రాసిన 40 మందిలో 20 మందికి నేరుగా ప్రభుత్వ మెడికల్ సీట్లు లభిస్తాయని, మరో ముగ్గురికి ఎన్‌సీసీ కోటాలో సీట్లు వస్తాయని తెలిపారు. ఈ ఏడాది జెస్సీకి 630 మార్కులు, పి.రిత్విక్‌బాబుకు 560 మార్కులు, పి.ప్రభాస్‌కు 520 ఉత్తమ మార్కులు లభించాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ సీఈవో సాయికృష్ణ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న స్మార్ట్ నీట్ అకాడమీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

శాంతి భద్రతలకు సహకరించాలి

చీమకుర్తి: నేడు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చీమకుర్తి పట్టణం, రూరల్ గ్రామాల్లో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎవరూ ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచాలు కాల్చడం వంటివి చేయరాదని చెప్పారు. మండలంలో ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతల పరిరక్షణకు భంగం కలగకుండా ప్రవర్తించాలని సూచించారు. పోలీసులు చెప్పిన హెచ్చరికలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అల్లర్లు జరగకుండా ఏర్పాట్లు

కొత్తపట్నం: నేడు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందుగానే ఎస్సై బి.సాంబశివరావు ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు అన్ని గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లోని బస్టాండ్ సెంటర్లలో కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశారు. అన్ని బస్టాండ్ సెంటర్లలో షాపులను మూసివేయించారు. మద్యం దుకాణాలను మూసివేయించారు. రేపు సాయంత్రం వరకు బస్టాండ్ సెంటర్‌కు ఎవరూ రావద్దని, ఒకేచోట ఇద్దరుముగ్గురికి మించి గుమికూడవద్దని, 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. విజయోత్సవాలు, ఊరేగింపులు చేయరాదని, బాణసంచా కాల్చరాదని సూచించారు. వీలైనంత వరకూ ఇంటి నుంచి బయటకు రావద్దని, ఎటువంటి గొడవలు పెట్టుకోవద్దని మైక్ ద్వారా ప్రచారం చేశారు.

ఖాకీ నీడలో పశ్చిమ ప్రకాశం

- గ్రామాలు, పట్టణాల్లో 144 సెక్షన్ అమలు
- మూతపడిన దుకాణాలు, హోటళ్లు

మార్కాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ ఎం.బాల సుందరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశం మొత్తం 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి షాపును మూసివేయాలని, ఎక్కడా కూడా నలుగురు వ్యక్తులు గుమిగూడి తిరగవద్దని, లాడ్జిల్లో కొత్త వ్యక్తులకు గదులు ఇవ్వవద్దని సూచించారు. ప్రజలందరూ ఇళ్లలోనే ఉండి ఎన్నికల ఫలితాలను వీక్షించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై రౌడీషీట్లు ఓపెన్‌చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు పట్టణాల్లో నాలుగువైపులా గ్రామాల నుంచి ప్రజలెవ్వరూ పట్టణాల్లోనికి రాకుండా పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురిపై రౌడీషీట్లు ఓపెన్ చేయడంతోపాటు బైండోవర్ చేశామని, మూడు నియోజకవర్గాల్లోని 40 సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్, నిఘా ఏర్పాటు చేశామన్నారు. మూడు నియోజకవర్గాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 పోలీసు యాక్టు కూడా మార్కాపురం డివిజన్‌లో అమలులో ఉందని, పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, డీజేలు పెట్టినా, బాణసంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఒంగోలు నుంచి అదనపు సిబ్బందిని రప్పించి అందుబాటులో ఉంచామని, ఏ సంఘటన జరిగినా నిముషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి చేరుకుని అల్లర్లను అదుపుచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

మార్కాపురంలో పోలీసు కవాతు

డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురం పట్టణంలో ఏపీఎస్పీ, బీఎస్ఎఫ్ జవాన్లతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ పోలీసు స్టేషన్ నుంచి దోర్నాల సెంటరు, నాయుడు బజారు, తేరు బజారు, మెయిన్ బజారు, కంభం సెంటరు మీదుగా కవాతు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో పలుచోట్ల పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

వ్యాపార సంస్థలు మూసి వేయాలి

పొదిలి: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా మంగళవారం వ్యాపార సంస్థలు మూతవేసి సహకరించాలని ఎస్సై జి.కోటయ్య కోరారు. 144వ సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. వ్యాపార సముదాయాలు, రెస్టారెంట్లు, హోటళ్లు మూసి వేసి సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు

కొనకనమిట్ల: మండలంలో సమస్యాత్మక గ్రామాలైన చినమనగుండం, చినారికట్ల, పెదారికట్ల, ఇరసలగుండం, నాగరాజుకుంట, నాగంపల్లి, వాగుమడుగు, సిద్దవరంలో సీసీ కెమెరాలతోపాటు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉరుములతో భారీ వర్షం



త్రిపురాంతకంలో భారీ వర్షంతో నిలిచిన నీరు

త్రిపురాంతకం: త్రిపురాంతకంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వారం రోజులుగా తీవ్రంగా ఎండలు కాస్తుండటంతో ప్రజలు బయటకు వచ్చే పరిస్థితులు లేవు. ఈ పరిస్థితుల్లో భారీ వర్షం కురవడం ప్రజలకు ఊరటనిచ్చింది. రుతుపవనాలు కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందన్న సమాచారంతో రైతులు ఆనందంతో ఉన్నారు.

పుల్లలచెరువులో ఓ మోస్తరు వర్షం



పుల్లలచెరువులో వర్షానికి చేరిన నీరు

పుల్లలచెరువు: పుల్లలచెరువులో ఆదివారం రాత్రి ఒంటి గంట నుంచి 2 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఈ వర్షంతో గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నీరు చేరింది. భూములు పదును కావడంతో రైతులు బిజీగా ఉండే అవకాశం ఉంది.